# గుట్టలో వైభవంగా తిరు కల్యాణోత్సవం



యాదగిరిగుట్టలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అమ్మవారికి హారతి ఇస్తున్న ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు

యాదగిరిగుట్ట, జనవరి 4 : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరు కల్యాణోత్సవం గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం నిర్వహించిన అర్చకులు ఉత్సవమూర్తులను ద్యివ మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవ నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా కల్యాణ తంతు జరిపించారు. కల్యాణోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీక్షించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామిని మేల్కొల్పి తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామి వారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులకు సువర్ణ పుష్పార్చనలు చేశారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం వేళలో స్వామి వారికి తిరువీధి, దర్బార్ సేవ ఘనంగా నిర్వహించారు.

ధనుర్మాసోత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున అర్చకులు వేద మంత్రాలు పఠిస్తూ అమ్మవార్లకు తిరుప్పావై పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ధనుర్మాస విశిష్టతను భక్తులకు వివరించారు. గోదాదేవి రంగనాయకుడిపై రచించిన పాశురాలను పఠిస్తూ అర్చకులు మార్గళి పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 12వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. అన్ని విభాగాలు కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ.25,64,062 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

### లక్ష్మీనరసింహుడికి వివిధ దేశాల కానుకలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి హుండీల ఆదాయం భారీగా సమకూరింది. స్వామి వారి దివ్యక్షేత్రానికి గతేడాదితో పాటు నూతన సంవత్సరం, వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని హుండీలకు పెద్ద ఎత్తున నగదు, బంగారం, వెండి సమకూరింది. యాదాద్రి కొండ కింద గల సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో హుండీలను లెక్కించగా రూ.3,15,05, 035 ఆదాయం వచ్చినట్లు ఈఓ రామకృష్ణారావు తెలిపారు. 100గ్రాముల మిశ్రమ బంగారం, 4 కిలోల 250 గ్రాముల మిశ్రమ వెండి వచ్చిందని తెలిపారు. అమెరికా దేశానికి చెందిన 2,006డాలర్లు, యూఏసీకి చెందిన 110ధిరమ్స్, ఆస్ట్రేలియాకు చెందిన 355డాలర్స్, ఇంగ్లాండ్‌కు చెందిన 155 పౌండ్స్, కెనడాకు చెందిన 195 డాలర్స్, ఒమాన్‌కు చెందిన 1,600 బైసా, న్యూజిలాండ్‌కు చెందిన 50 డాలర్లు, మలేశియాకు చెందిన 13రింగ్గిట్స్‌తో పాటు నేపాల్, థాయిలాండ్, కువైట్, ఆఫ్రికా, బంగ్లాదేశ్, యుగాండా, ఇండోనేషియా, కత్తర్, యూరఫ్ దేశాలకు చెందిన కరెన్సీ సమకూరిందని తెలిపారు.

## సాక్షాత్తూ దేవతా నిర్మాణం యాదగిరిగుట్ట

- త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామి



సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామికి పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జనవరి 4 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని పరిశీలిస్తే సాక్షాత్తు దేవతా నిర్మాణంగా దర్శనమిస్తున్నదని అష్టాక్షరి పీఠాధిపతులు త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామి తెలిపారు. గురువారం ఆయన లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు, అధికారులు స్వామి జీని ఆలయ మర్యాదలతో సత్కరించి పండ్లు అందించారు. ఈ సందర్భంగా ముఖ మండపంలో జీయర్ భక్తులందరికీ అనుగ్రహ భాషణం చేశారు. భగవత్ అనుగ్రహం కలిగిన వారికే స్వామివారి దర్శనం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ధనుర్మాసంలో స్వామిని దర్శించుకోవడం చాలా తృప్తిగా ఉందన్నారు. చాలాకాలం నుంచి స్వామి వారి క్షేత్రాన్ని సేవించాలని భావించామని ఇన్నాళ్లకు స్వామి వారి దర్శనం కలగడం మహాభాగ్యంగా భావిస్తున్నామన్నారు. ప్రహ్లాదుడి మనో సంకల్పంతో పాలకులు, పరిచారకుల ద్వారా ఆలయం గొప్పగా రూపుదిద్దుకోవడం ఎంతో ఆనందదాయకమని కొనియాడారు.

# ఎన్నికల వ్యయ ఖర్చుల నివేదికను సమర్పించాలి

- జిల్లా ఎన్నికల అధికారి హనుమంతు కే.జెండగే



ఎన్నికల అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి అర్బన్, జనవరి 4 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గత పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేసిన ఖర్చు, డబ్బు, మద్యం ఇతర వస్తువుల పంపిణీ పట్టివేతకు సంబంధించిన సమాచారం ఆధారంగా ప్రాథమిక నివేదిక సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులకు సూచించారు. ఎన్నికల వేళ సున్నితమైన నియోజకవర్గా లు, ప్రాంతాలను గుర్తించేందుకు గురువారం ఆయన జిల్లా ఇంటలిజెన్స్ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ పోలీస్, ఐటీ, జీఎస్టీ, బ్యాంకులకు చెందిన నిర్దేశిత అధికారులు సభ్యులుగా ఉండి గత అసెంబ్లీ, పార్లమెంటరీ ఎన్నికల సమయం లో ఖర్చు చేసిన డబ్బు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ పట్టివేతలు సమాచారం ఆధారంగా ప్రాథమిక నివేదిక ఏర్పాటు చేయాలన్నారు. ఆ నివేదిక ఆధారంగానే సున్నితమైన వ్యయ అసెంబ్లీ నియోజకవర్గాలు, ప్రాంతాలను ఎన్నికల సంఘం గుర్తించి తదనుగుణంగానే, వాటిని ప్రత్యేకంగా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేశ్ చంద్ర, నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, నకిరేకల్ అసెంబ్లీ సెగ్మెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ హేమంత్ కేశవ్ పాటిల్, జనగాం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జనగాం అసెంబ్లీ సెగ్మెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ పర్మర్ పింకేశ్ కుమా ర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏ.భాస్కరరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఆలేరు అసెంబ్లీ సెగ్మెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ జి.వీరారెడ్డి, భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి, భువనగిరి అసె ంబ్లీ సెగ్మెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ అమరేందర్, సెంట్రల్ జీఎస్‌టీ సూపరింటెండెంట్ అభిలాష బిస్త్, సెంట్రల్ జీఎస్‌టీ ఇన్‌స్పెక్టర్ అరుణ్‌కుమార్, ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్ ప్రకాశ్‌శర్మ, జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి రామకృష్ణ, ఏసీటీఓ వెంకటేశం, తాసీల్దార్లు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి పాల్గొన్నారు.

## విదేశాల్లో ఉద్యోగాలకు దరఖాస్తులు

భువనగిరి అర్బన్, జనవరి 4 : తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ద్వారా విదేశాల్లో ఉద్యోగ నియామకాలకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనా అధికారి పి.సాహితీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు శిక్షణ, భాషా నైపుణ్యాలు, విదేశీ ఉద్యోగ నియామకాలు అందించడానికి టామ్ కామ్ సంస్థ విదేశాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆమోదిత ఏజెన్సీలతో భాగస్వామ్యం కల్పించిందని తెలిపారు. జపాన్‌లో హాస్పిటాలిటీ రంగానికి అధిక డిమాండ్ ఉందని, ఈ ఉద్యోగానికి నెలకు లక్ష నుంచి 1.50లక్షల వరకు ఆకర్షణీయమైన జీతం ఉంటుందని తెలిపారు. సురక్షితమైన, చట్టబద్ధమైన వలస మార్గాల ద్వారా రిక్రూట్‌మెంట్ ప్రక్రియను సులభతరం చేయడంలో (టామ్ కామ్) సహాయ పడుతుందని తెలిపారు. దరఖాస్తు నమోదుకు టామ్‌కామ్ హెచ్‌ఆర్ మేనేజర్ 9100798204, 7893566493 నంబర్లను సంప్రదించాలని లేదా బయోడేటాను hrm-tomcom-letf@telangana.gov.inకి జనవరి 7లోగా మెయిల్ చేయాలని కోరారు.



మిల్లర్లతో సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

## నెలాఖరులోగా సీఎంఆర్ పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

మిర్యాలగూడ, జనవరి 4 : రైస్ మిల్లర్లు ఈ నెల 30లోపు సీఎంఆర్ పూర్తి చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యం అందించాలని కలెక్టర్ శ్రీనివాస్ సూచించారు. మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో మిల్లర్లతో గురువారం సమావేశమయ్యారు. మిల్లుల వారీగా ఇప్పటి వరకు ఇచ్చిన సీఎంఆర్ వివరాలను స్థానిక అధికారుల నుంచి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 69 రైస్ మిల్లుల నుంచి 2100 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉన్నదని, ఈ నెల 30లోగా అందించాలని అన్నారు. సీఎంఆర్ ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఎఫ్‌సీఐ గోదాములను పరిశీలించి సకాలంలో ఏసీలు వస్తున్నాయా.. అన్‌లోడింగ్ జరుగుతుందా? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, మేనేజర్ నాగేశ్వర్‌రావు, ఆర్డీఓ చెన్నయ్య, సివిల్ సప్లయ్ డీటీ జావేద్, ఆర్‌ఐ సురేందర్‌సింగ్, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, కార్యదర్శి వెంకటరమణ చౌదరి, మిల్లర్లు పాల్గొన్నారు.

### ఫిబ్రవరి 21 నుంచి మినీ మేడారం జాతర

గుండాల, జనవరి 4 : మండలంలోని సీతారాంపురంలో ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు మినీ మేడారం జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహక పూజారి వట్టిపల్లి భిక్షపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న సారలమ్మ మాసాన్‌పల్లి నుంచి సీతారాంపురంలోని గద్దెకు చేరుతుందని, 22న ఎర్రబోళ్ల గుట్ట నుంచి సమ్మక్క గద్దెకు చేరనున్నట్లు తెలిపారు. 23న సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు భక్తులకు దర్శనం ఇస్తారని, 24న సమ్మక్క, సారలమ్మలు తిరిగి వనప్రవేశం చేయనున్నట్లు పేర్కొన్నారు. 30 వేల మంది భక్తులు జాతరకు వచ్చే అవకాశం ఉందని, అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

## 6న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

(మొదటిపేజీ తరువాయి)

పార్టీల ప్రతినిధులతో సమావేశమై స్పెష ల్ సమ్మరీ రివిజన్ 2024 అంశాలపై చర్చించారు. 2023 నవంబర్ 10న రెండవ స్పెషల్ సమ్మరీ రివిజన్ ప్రకారం తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరిగిందని, తిరిగి కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ సమ్మరీ రివిజన్–2024 ప్రకారం తేది 01-01-2024 అర్హత తేదీగా నిర్ణయిస్తూ షెడ్యూల్ విడుదల చేశారని తెలిపారు. దాని ప్రకారం పోలింగ్ బూతుల హేతుబద్ధీకరణ, ఓటర్ల జాబితాలో ఉన్న వ్యత్యాసాలను డిసెంబర్ 20ను ంచి ఈ నెల 5వరకు చేపట్టినట్లు తెలిపారు. ఈ నెల 6న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందని, వాటిలో చేర్పులు, తొలగింపుల కోసం ఈ నెల 6నుంచి 22వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. వచ్చే ఫిబ్రవరి 2 వరకు దరఖాస్తులు పరిష్కరించి 6వరకు డేటా బేస్ అప్డేట్ చేస్తామని తెలిపారు. ఫిబ్రవరి 8న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని పేర్కొన్నారు. చేర్పులు, తొలగింపుల కోసం దరఖాస్తులు అన్ని పోలింగ్ కేంద్రాల్లో, తాసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల్లో అందించవచ్చని, ఎన్నికల కమిషన్ వెబ్‌సెట్ https://voters.eci. gov.in, Voter helpline appలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల వారు బుత్ స్థాయి అధికారికి సహకరించాలని కోరారు. చేర్పులు, తొలగింపులకు సంబంధించి తేది. 11-11-2023 నుంచి 03-01-2024 వరకు 6,7,8 దరఖాస్తులకు సంబంధించి 18,331 దరఖాస్తులు స్వీకరించామని, 5,856దరఖాస్తులు ఆమోదిం చగా 10,508 విచారణలో ఉన్నాయని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు వారి పార్టీకి సంబంధించిన వారిని బూత్ స్థాయి ఏజెంట్లను నియమించి వారి వివరాలను జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి సమర్పించాలని సూచించారు.